విద్యుత్ షాక్‌తో ఏనుగు దుర్మరణం

ప్రజాశక్తి - వి.కోట (చిత్తూరు)

పంటలను కాపాడుకునే ప్రయత్నంలో ఓ రైతు అమర్చిన కరెంట్ తీగలకు ఏనుగు చిక్కుకుని విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఈ ఘటన చిత్తూరు జిల్లా వి.కోట మండల పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతమైన గోనుమాకులపల్లి గ్రామ పంచాయతీ నాగిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు...నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సురేష్ తన పొలంలో మల్బరీ, టమోటా, వరి ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అటవీ సరిహద్దు పొలం కావడంతో జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు పొలం చుట్టూ తీగలను అమర్చారు. ఆ తీగలకు రాత్రిపూట విద్యుత్ కనెక్షన్ ఇచ్చేవారు. ఆహారం కోసం ఒంటరి మగ ఏనుగు తోటకనుమ బీట్ పరిధిలో ఒలుకులంక అటవీ సమీపం నుంచి వచ్చి పంట పొలాల్లోకి చొరబడింది. తిరిగి వెళ్లే క్రమంలో విద్యుత్ తీగలు తగులుకుని అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న సురేష్ గ్రామం విడిచి పారిపోయారు. అటవీ, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులకు విషయం తెలియడంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఏనుగు మృతిపై ఆరా తీశారు. తిరుపతి జంతుశాల అధికారి ఆధ్వర్యంలో ఏనుగుకు పంచనామా చేసి ఖననం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తుని-సబ్బవరం రహదారిని ఎన్‌హెచ్‌గా మార్చాలి

- నితిన్ గడ్కరీకి కరణం ధర్మశ్రీ వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలోని తుని-సబ్బవరం రహదారిని జాతీయ రహదారి (ఎన్‌హెచ్)గా మార్చాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ విజ్ఞప్తి చేశారు. బుధవారం నాడిక్కడ కేంద్ర మంత్రితో భేటీ అనంతరం ధర్మశ్రీ మీడియాతో మాట్లాడారు. 133 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారికి రూ.2,200 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. దీనికి సంబంధించి డిపిఆర్ కూడా పూర్తయిందని తెలిపారు. రహదారి పనులు వేగంగా చేపట్టాలని కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశానన్నారు. ఈ రహదారి పూర్తయితే ఏడు నియోజకవర్గాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. తమ విజ్ఞప్తికి కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

ఎన్ఎఒబి నిర్వాసితుల ఆందోళన ఉధృతం

- మూడో రోజూ కొనసాగిన నిరసన
- నిర్వాసితులకు సిపిఎం, టిడిపి, జనసేన మద్దతు

ఆందోళనలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు దేవుడునాయుడు

ప్రజాశక్తి-రాంబిల్లి, అనకాపల్లి జిల్లా

ఉపాధి, చేపల వేట, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడ నర్సాపురం గ్రామం వద్ద ఉన్న నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఎఒబి) మెయిన్ గేటు వద్ద నేవల్ బేస్ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరింది. బుధవారంనాటి ఆందోళనలో పురుషులు, మహిళలు, వృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ నేవల్‌బేస్ ఏర్పాటుతో భూములు, ఉపాధి కోల్పోయిన కొత్తపేట, చినకలవలాపల్లి, గోవిందపాలెం, వాడపాలెం గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయి ప్యాకేజీలు ఇవ్వడంతోపాటు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నేవీ పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. న్యాయమైన తమ డిమాండ్లను ప్రభుత్వం, నేవీ అధికారులు పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్ఎఒబి నిర్వాసితుల ఆందోళనకు టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీష్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, జనసేన ఉత్తరాంధ్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్‌కుమార్, సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధ నాగజగదీష్ మాట్లాడుతూ.. మత్స్యకారులకు టిడిపి అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమస్యపై కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. జనసేన నాయకుడు సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని నాబ్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు జి.దేవుడునాయుడు మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా నేవల్ బేస్ నిర్వాసితుల న్యాయమైన సమస్యల పరిష్కారం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వీరి సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేను నిలదీస్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్యే కన్నబాబు రాజుకు నిరసన సెగ

ప్రజాశక్తి -అచ్యుతాపురం, అనకాపల్లి జిల్లా

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజుకు నిరసన సెగ తగిలింది. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన దొప్పర్ల గ్రామంలో పర్యటించారు. కన్నబాబురాజు పర్యటనను ఆ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానికులు అడ్డుకున్నారు. ఆయనకు వ్యతిరేకంగా గ్రామానికి చెందిన మహిళలు, వైసిపి కార్యకర్తలు ఫ్లకార్డులు ప్రదర్శించారు. 'జగన్ ముద్దు -కన్నబాబు వద్దు' అంటూ నినదించారు. అర్హులైన లబ్ధిదారులకు జగనన్న ఇంటి స్థలాలు ఇవ్వకుండా ఎమ్మెల్యే నచ్చినవారికి కేటాయించారంటూ ఆందోళనకు దిగారు. అచ్యుతాపురం సిఐ మురళీధరరావు ఆధ్వర్యాన పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, గ్రామస్తులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు.

ప్రధాని మోడీ సభ ఏర్పాట్లు పరిశీలన

రాజకీయం చేయొద్దు : విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ, విశాఖ

విశాఖపట్నంలో ఈ నెల 11, 12 తేదీలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన, బహిరంగ సభ నేపథ్యంలో ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాట్లను రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పర్యవేక్షించారు. యూనివర్సిటీలో పలు బహిరంగ ప్రదేశాలను, పార్కింగ్ కోసం మరికొన్ని క్రీడా స్థలాలు పరిశీలించారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంక్యుబేషన్ సెంటర్‌లో అన్ని శాఖల ప్రధాన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోడీ 11న విశాఖ చేరుకొంటారని తెలిపారు. 12న ఏడు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు. ప్రజలనుద్దేశించి బహిరంగసభలో మాట్లాడతారని తెలిపారు. ప్రధాని బహిరంగ సభ, ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాలను పిఎంఒ ఖరారు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ బాధ్యతలు చేపడుతుందని వివరించారు. ఇది రాజకీయ పార్టీలకు సంబంధించిన కార్యక్రమం కాదని, పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వంగా చేపడుతున్న కార్యక్రమమని వెల్లడించారు. ప్రధాని పర్యటనను రాజకీయం చేయొద్దని కోరారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ.. ఈ పర్యటనలో ప్రధాన మంత్రి మోడీ రూ.10,472 కోట్లతో



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపి విజయసాయిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు

వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారని తెలిపారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ, రాయపూర్- విశాఖపట్నం ఆరు లేన్ల రహదారి, కాన్వెంట్ జంక్షన్- షీలానగర్ పోర్టు రోడ్డు అభివృద్ధి, విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునరుద్ధరణ, గెయిల్‌కు సంబంధించి శ్రీకాకుళం-అంగుళ్ పైప్‌లైన్ ఏర్పాటు, నరసన్నపేట- ఇచ్చాపురం రోడ్డు అభివృద్ధి, ఒఎన్‌జిసియు ఫీల్డ్ డెవలప్‌మెంట్ ఇన్ ఈస్టర్న్ ఆఫ్ షోర్ కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం నిర్వహిస్తారని వివరించారు. ఏర్పాట్ల పరిశీలనలో విశాఖ పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, జివిఎంసి కమిషనర్ రాజాబాబు, ఎయు వైస్ ఛాన్సలర్ ప్రసాద్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్ క్యాప్ చైర్మన్ కెకె.రాజు ఉన్నారు.

జిఎంసి బాలయోగి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెంకయ్యనాయుడు

ప్రజల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్యం బలోపేతం

మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ, విశాఖ

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అన్నారు. విశాఖపట్నం ఆంధ్రవిశ్వవిద్యాలయం వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో బుధవారం 'లోక్‌సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి ధర్మనిధి ప్రసంగం' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 'పార్లమెంటరీ డెమొక్రసీ' అంశంపై వెంకయ్యనాయుడు మాట్లాడుతూ చట్టసభల్లో ప్రజా ప్రతినిధుల ప్రవర్తన, మాటతీరు హుందాతనంగా ఉండాలన్నారు. చట్టసభల్లో జరుగుతున్న సంఘటనలను ప్రజలు చూస్తున్నారని, కొన్నింటిని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. పార్టీలు సైతం తమ సభ్యులకు ప్రత్యేక నియమావళిని రూపొందించాలని సూచించారు. విద్యాసంస్థలు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌గా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. యువతరం తమ జ్ఞానాన్ని పెంచుకోవడానికి, దానిని ఇతరులతో పంచుకోవడానికి దృష్టిసారించాలని సూచించారు. తాను, బాలయోగి ఎయు న్యాయ కళాశాల నుంచి ఎదిగి రాజ్యసభ, లోక్‌సభలకు అధ్యక్ష స్థానాలలో నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను పుట్టి పెరిగిన కోనసీమ ప్రాంత అభివృద్ధికి బాలయోగి పడ్డ తపన, చేసిన కృషిని వివరించారు. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ బాలయోగి శాంతస్వభావి అన్నారు. ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాలకు పెద్దపీట వేస్తూ యువతను ప్రోత్సహిస్తున్న విధానం గురించి వివరించారు. ముందుగా బాలయోగి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి కృష్ణమోహన్, న్యాయకళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వి విజయలక్ష్మి, ఐఎఎస్ఇ ప్రిన్సిపల్ ఆచార్య టి శోభశ్రీ, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

2023 నాటికి భూముల రీసర్వే పూర్తి

- రీ సర్వే టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ అజేయ కల్లం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

భూముల రీసర్వే ప్రక్రియ 2023 సెప్టెంబర్ నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారులు, రీ సర్వే టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ అజేయ కల్లం తెలిపారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం అమలు తీరుపై ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, జెసిలు, రెవెన్యూ అధికారులతో బుధవారం ఒంగోలు కలెక్టరు కాన్ఫరెన్స్ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజేయ కల్లం మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో భూములకు సంబంధించిన గ్రీవెన్స్ ఉండరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం రీసర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తోందని తెలిపారు. అన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తయిన తదుపరి రెవెన్యూ గ్రీవెన్స్ వస్తే అధికారులే బాధ్యులని ఆయన హెచ్చరించారు. వందేళ్ల తరువాత చేపడుతున్న భూముల రీసర్వే చరిత్రలో నిలిచిపోతోందన్నారు. తప్పులు, పొరపాట్లకు అవకాశం ఇవ్వరాదని, అధికారులు నిబద్ధతతో పనిచేయాలని, దృష్టంతా రీసర్వేపై ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజలను ఎట్టి పరిస్థితులలో ఇబ్బంది పెట్టరాదని, ప్రాథమిక విచారణ, రెవెన్యూ దస్త్రాల నిశిత పరిశీలనతోనే భూ హక్కుదారుల పేర్లను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు క్షుణ్ణంగా తెలుసుకుని పరిష్కార మార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో సిసిఎల్ఎ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జి.సాయిప్రసాద్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డుల కమిషనర్ సిద్ధార్థ జైన్, ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్, బాపట్ల జిల్లా కలెక్టరు విజయకృష్ణన్, నెల్లూరు జిల్లా సంయుక్త కలెక్టర్ కూర్మనాథ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో సర్కారు దొంగాట..!

- శాశ్వత పోస్టుల స్థానంలో తాత్కాలిక పద్ధతి
- కోర్టులో కేసు నడుస్తుండగానే ఆదేశాలు

అంగన్‌వాడీ (ఫైల్) ఫోటో

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

సీనియర్ అంగన్‌వాడీ వర్కర్లతో ప్రభుత్వం దొంగాట ఆడుతోంది. శాశ్వత ప్రాతిపదికన సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి.. పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి... అవకతవకలకు పాల్పడి... దీనిపై కోర్టులో కేసు నడుస్తుండగానే తాత్కాలిక పద్ధతిలో పోస్టులు భర్తీ చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. సీనియర్లకు రూ.ఐదువేలు అదనపు వేతనం ఇచ్చి పెట్టుకోవాలని నిర్ణయించింది. కోర్టులో కేసు నడుస్తుండగానే ప్రభుత్వం ఇలా ఎలా వ్యవహరిస్తోందని అంగన్‌వాడీ వర్కర్లు వాపోతున్నారు.

రాష్ట్రంలో గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులు దాదాపు 619, గ్రేడ్-1లో దాదాపు 66 ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాలని 2013 నుంచి అంగన్‌వాడీ వర్కర్లు డిమాండు చేస్తూ వచ్చారు. వీటిని తొలుత ఎపిపిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని అనుకున్నా తరువాతి క్రమంలో ఐసిడిఎస్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసి శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వ ప్రకటించింది. దీంతో సీనియర్ అంగన్‌వాడీ వర్కర్లు తమకు న్యాయం జరుగుతుందని భావించారు. ఈ పోస్టులకు 30వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. 26వేల మంది పరీక్షలు రాశారు. ఫలితాలు విడుదల చేయకుండానే అర్హులను గుర్తించి, వారికి శిక్షణ ఇచ్చారు. ఈ విధంగా చేయడంపై ఆరోపణలు మిన్నంటాయి. తమకు అన్యాయం జరిగిందని కొందరు కోర్టు మెట్లెక్కారు. దీంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. ఈ పోస్టుల భర్తీకి తదుపరి ఎలాంటి చర్యలూ తీసుకోవద్దని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

తెరపైకి తాత్కాలిక సూపర్ వైజర్ పోస్టులు

కోర్టులో కేసు నడుస్తుండగానే రెండు రోజుల క్రితం తాత్కాలిక పద్ధతిలో సూపర్‌వైజర్లను ఏర్పాటు చేసుకోవాలంటూ రాష్ట్ర కేంద్రం నుంచి జిల్లాలకు ఆదేశాలు అందాయి. అర్హులైన సీనియర్ అంగన్‌వాడీలను ఇందులో నియమించాలని, సిడిపిఒలే దీన్ని చూసుకోవాలని పేర్కొంది. ఇలా ఎంపికైన వారికి అదనంగా రూ.ఐదువేలు గౌరవవేతనం ఇవ్వాలని తెలిపింది. రెగ్యులర్ విధానంలో పోస్టులు భర్తీ అయ్యే వరకు ఈ తాత్కాలిక విధానం కొనసాగుతుందని పేర్కొంది.

అంగన్‌వాడీల్లో ఆగ్రహం

కోర్టులో కేసు నడుస్తుండగానే తాత్కాలిక పద్ధతిలో పోస్టుల భర్తీ చేస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని అంగన్‌వాడీ వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇన్‌ఛార్జీ సూపర్‌వైజర్లను నియమించి, కనీసం వారికి వేతనం కూడా ఇవ్వలేదని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు మరలా అంగన్‌వాడీలను మరోసారి మోసం చేయటానికి మరోమారు పూనుకుందని వారు అంటున్నారు.

ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం దుర్మార్గం

- కాల్వ శ్రీనివాసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ వాసులేవరూ పాలనా రాజధాని కోరుకోవటం లేదని మాజీమంత్రి కాల్వ శ్రీనివాసులు తెలిపారు. విశాఖలో రాజధాని పెడితే రాయలసీమకు దూరమవుతుందని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమకు అన్యాయం చేస్తూ ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడం దుర్మార్గమని విమర్శించారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు జగన్ కృత్రిమ ఉద్యమాలకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పంలో ప్రజాస్వామ్యాన్ని జగన్ ఖూనీ చేశారని టిడిపి మహిళ విభాగం అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శించారు. రాష్ట్రంలో మహిళా కమిషన్ జగన్ కమిషన్‌లా మారిందని ఆరోపించారు. రైతులకు న్యాయం చేయలేని జగన్ అధికారంలో ఉండే అర్హత లేదని మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ అన్నారు. ఇప్పటికీ 77 వేల మంది రైతులకు రైతు భరోసా జమకాలేదని, నెలలు గడుస్తున్నా ధాన్యం డబ్బులు అందడం లేదని పేర్కొన్నారు. జగన్ పాలనలో ఇప్పటికే 5 వేల మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు.

ఎర్రన్నాయుడుకు నివాళి

టిడిపి మాజీనేత ఎర్రన్నాయుడు 10వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఆ పార్టీ శ్రేణులు ఘన నివాళులర్పించారు. టిడిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎర్రన్నాయుడు చిత్రపటానికి కాల్వ శ్రీనివాసులు, కొనకళ్ల నారాయణ, పర్చూరి అశోక్‌బాబు, దారపనేని నరేంద్రం, సయ్యద్ రఫీ, వెంకటేశ్వర్ రావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

పెట్రో కెమికల్ రంగంలో పెట్టుబడులకు ఏపి అనుకూలం

ఇండియా కెమ్ సదస్సులో రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పెట్రో కెమికల్ రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూలమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. దేశ రసాయన, పెట్రో కెమికల్ పరిశ్రమ వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. బుధవారం నాడిక్కడ ప్రగతి మైదాన్‌లో నిర్వహించిన ఇండియా కెమ్-2022 సదస్సును ఉద్దేశించి మంత్రి అమర్‌నాథ్ ప్రసంగించారు. 2020-21నాటికి రాష్ట్రంలో కెమికల్స్, పెట్రో కెమికల్స్ ఉత్పత్తి 11.9 బిలియన్ డాలర్లుతో దేశీయ ఉత్పత్తిలో 8 శాతంగా ఉందన్నారు. ఈ రంగంలో ఇంకా 7.3 బిలియన్‌డాలర్ల పెట్టుబడికి 1,39,627 మందికి ఉపాధి కల్పించడానికి రాష్ట్రం అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. కెమికల్స్, పెట్రో కెమికల్స్ రంగంలో ఆంధ్రప్రదేశ్ ఛాంపియన్‌లా దూసుకెళ్తోందన్నారు. 974 కిలోమీటర్ల సముద్ర తీరంతో ఈస్ట్రన్ గేట్ వే ఆఫ్ ఇండియాగా ఏపి మారిందన్నారు. పోర్టు ఆధారిత అభివృద్ధికి సిఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ వనరులు ఉన్నాయన్నారు. గడిచిన మూడేళ్లలో రాష్ట్రానికి రూ.46,280 కోట్లతో 107 మెగా పరిశ్రమలు వచ్చాయని 70,606 మందికి ఉపాధి దక్కిందన్నారు. 35,181 చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుతో 2,11,374 ఉద్యోగాలు కల్పించామని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. రాష్ట్రంలో అనేక పెద్దపెద్ద పరిశ్రమలు ఉన్నాయని, విశాఖలోని హెచ్‌పిసిఎల్‌లో దేశ అతిపెద్ద హైడ్రోక్రాకర్ యూనిట్ ఈ ఏడాది చివరి నాటికి 15 మిలియన్ టన్నుల సామర్థ్యానికి చేరుకుంటుందన్నారు. రాష్ట్రంలోని సహజమైన ప్రయోజనాల కారణంగా కెమికల్స్, పెట్రో కెమికల్స్ పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి అత్యుత్తమ గమ్యస్థానంగా మంత్రి అమర్‌నాథ్ అభివర్ణించారు. ఈ సందర్భంగా కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి మాన్సుఖ్ మాండవీయాను మంత్రి అమర్‌నాథ్ శాలువాతో సత్కరించారు.

మీటర్ల పేరుతో కుంభకోణం

వినియోగం కోసం అవసరం లేదు

మండలి ప్రతిపక్షనేత యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు పేరుతో పేరుతో రూ.3,500 కోట్ల కుంభకోణానికి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతోందని శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. విద్యుత్ వినియోగం తెలుసుకోవడానికైతే స్మార్ట్ మీటర్లు బిగించాల్సిన అవసరం లేదని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగం కోసమే మీటర్లు బిగిస్తున్నామని ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యుత్ వినియోగం తెలుసుకునేందుకు సెఫరేట్ ఫీడర్లు చంద్రబాబు తీసుకొచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ బోరు కనెక్షన్‌కు ఎంత ఖర్చవుతుందో తెలుసుకోవాలంటే కేవలం రూ.300తో మార్కెట్‌లో దొరికే సాధారణ విద్యుత్ మీటర్ అమర్చితే సరిపోతుందని, దీనికోసం రూ.35 వేలతో స్మార్ట్ మీటర్ పెట్టాల్సిన అవసరం లేదని తెలిపారు.

జగన్ మాత్రం రూ.3500 కోట్ల కుంభకోణానికి పాల్పడటానికే రైతుల మెడకు ఉరితాళ్లు బిగిస్తున్నారని విమర్శించారు.

ప్రకృతి వ్యవసాయ రైతులతో 4న టిటిడి సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రకృతి వ్యవసాయ రైతులతో ఈ నెల 4న తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు రైతు సాధికార సంస్థ పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తిరుపతిలో నిర్వహించే ఈ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా 100 మందిని ఎంపిక చేసినట్లు ఆ సంస్థ తెలిపింది. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో 12 రకాల వ్యవసాయ ఉత్పత్తులను సేకరించి టిటిడికి అందించనుంది. లడ్డు తయారీకి రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ శనగలను వినియోగిస్తున్న టిటిడి మరో 11 రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని సంకల్పించిందని పేర్కొన్నారు. టిటిడి ఎంపిక చేసే ప్రకృతి ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు అదనంగా 10 శాతం ప్రీమియం చెల్లిస్తుందని తెలిపింది.

చిరు సంస్థల్లోనే 50% ఉద్యోగాలు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ఉద్యోగుల సృష్టిలో సూక్ష్మ, చిరు వ్యాపార సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అప్నా డాట్ కో ప్లాట్‌ఫామ్ పేర్కొంది. గడిచిన మూడు నెలల్లో విశాఖపట్నంలోని 50 శాతం పైగా ఉద్యోగావకాశాలను చిరు సంస్థలే సృష్టించాయని తెలిపింది. రాష్ట్రంలో తమ సంస్థకు 5వేలకు పైగా సంస్థలుండగా.. వీరిలో 2500 మంది వైజాగ్‌లోని వారేనని పేర్కొంది. టెలికాలింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్, డెలివరీ పర్సన్, ఫీల్డ్ సేల్స్, డాటా ఎంట్రీలో ఎక్కువ ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయని పేర్కొంది. గడిచిన 90 రోజుల్లో 1.30 లక్షల ఉద్యోగ దరఖాస్తులు నమోదయినట్లు పేర్కొంది.

చెదురుమదురు వర్షాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నెల్లూరు జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. సోమవారం రాత్రి నుంచి బుధవారం వరకు కురుస్తోన్న వర్షాలకు నెల్లూరు నగరంతో పాటు పలు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యధికంగా అల్లూరులో 196 మిల్లీమీటర్లు.. అత్యల్పంగా కోవూరులో 85.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా చెదరు ముదురు వర్షాలు కురుస్తున్నాయి. అత్యధికంగా శ్రీకాళహస్తిలో 40.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదవ్వగా..అత్యల్పంగా కెవిబిపురంలో 39.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. కడప, అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురింది. ముందు జాగ్రత్తగా ఎస్‌పి హర్షవర్ధనరాజు అన్నమయ్య జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్ర